ఈనాడు
పశ్చిమగోదావరి
శుక్రవారం అక్టోబరు 11, 2024

నిండా నీరు... నాట్లు వేసేదెలా?

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇవి భీమవరం మండలం రాయలం, కొమరాడ గ్రామాల పరిధిలోని వరి పొలాలు. కొద్ది రోజుల కిందట భారీ వర్షాలు కురిసినప్పటి నుంచి ఇలా చేలన్నీ మోకాలి లోతు నీటిలో ఉన్నాయి. దాంతో నాట్లు వేసే అవకాశం లేక రైతులు ఈ సీజన్‌లో సాగును వదిలేశారు. గతంలో రెండు పంటలు సమృద్ధిగా పండే భూములు సైతం ఇలా మారాయి. మండలంలో వందలాది ఎకరాలు ఇలా ఉన్నాయి. డ్రెయిన్లు ప్రక్షాళన చేస్తే తప్ప ఇక్కడ సాగుకి పూర్వ వైభవం వచ్చే అవకాశం లేదు.



శివంకరి.. శుభంకరి

పెనుగొండ, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెనుగొండలోని నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వాసవీశాంతిధాంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

లేశమాత్రమైనా అందని సేవలు

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు(గ్రామీణ, నరసాపురం, పెనుగొండ గ్రామీణం, న్యూస్‌టుడే

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మెరుగైన వైద్యం అందించాల్సిన సర్కారు వైద్యాలయాలు కనీసం మాత్రలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో నెలకు 25 వేల వరకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నా, అవసరమైన మేరకు ఔషధాలు, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండటం లేదు. మధుమేహం, వాంతులు, గ్యాస్, మూర్ఛ, మత్తుమందులు, పలు రకాల స్టెరాయిడ్స్ తదితర ఔషధాలు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. ఏదైనా ప్రమాదానికి గురైనపుడు ఇచ్చే ఇంజెక్షన్లు సైతం అందుబాటులో లేవని రోగులు వాపోతున్నారు.

పరిశీలన

✷ సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టు అందుబాటులో ఉండటం లేదు. ఒకవేళ ఉన్నా మందులిచ్చేందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని రోగుల బంధువులు వాపోతున్నారు. టైఫాయిడ్ కిట్లు అందుబాటులో లేక పరీక్షలు బయట చేయించుకుంటున్నారు.

60 ఏళ్ల వయసులో సుగర్ మాత్రలకు రెండు కిలోమీటర్ల నుంచి నడిచి వచ్చానని, గతంలో ఒకేసారి ఇచ్చేవారని, కొంతకాలంగా తగ్గించి ఇవ్వడంతో రెండు మూడు సార్లు తిరగాల్సి వస్తోందని లక్ష్మి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల ఓ మహిళ రహదారి ప్రమాదంలో గాయపడ్డారు. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్తే వైద్యుడు రాసిచ్చిన మందులు అక్కడ లేకపోవడంతో బయట కొనుగోలు చేశారు. దీనికి రూ.300 వరకు ఖర్చయిందని ఆమె వాపోయారు.

ఆసుపత్రుల్లో ఔషధాల కొరత



నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో ఔషధాలకు బారులు

జిల్లా ఆసుపత్రి	1
ప్రాంతీయ ఆసుపత్రులు	4
సీహెచ్‌సీలు	3
పీహెచ్‌సీలు	34
యూహెచ్‌సీలు	18

రోజుకి సరాసరిన ఓపీ:

జిల్లా ఆసుపత్రి	450-550
ప్రాంతీయ ఆసుపత్రులు	350-400
పీహెచ్‌సీలు	50-70

మోయలేని భారం

మందుల పంపిణీకి రూ.15లక్షల నుంచి 20 లక్షల వరకు వెచ్చిస్తున్నా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. గతంలో పదిరోజులకు రాసిన మందులను ప్రస్తుతం మూడు నాలుగు రోజులతో సరిపెడుతున్నారని, ఆర్థికంగా భారమవుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఔషధాలు అందుబాటులో లేక చాలామంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఫీజు, పరీక్షలు, మందులకు రూ.వేలల్లో వెచ్చించక తప్పడం లేదు, ఇన్‌పేషెంట్లుగా చేరితే రూ.10వేల వరకు ఖర్చవుతోంది.

"ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పించి, ఔషధాల కొరత లేకుండా చూస్తాం' అని డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ తెలిపారు.

వసూళ్లలో దగా.. ఖజానాకు సెగ

డి అండ్ ఒ ట్రేడ్ లైసెన్సు జారీలో అవకతవకలు

భీమవరం పట్టణం, పాలకొల్లు, న్యూస్‌టుడే: దుకాణాలు, కర్మాగారాలకు పురపాలక, నగరపాలక సంస్థలు జారీ చేసే డేంజరస్ అండ్ అఫెన్సివ్(డిఅండ్ఒ) ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వేల సంఖ్యలో ఉన్న దుకాణాల నుంచి అనధికారికంగా లైసెన్సు ఫీజుల్ని వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పట్టణాల్లో ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించాలన్నా ప్రజారోగ్య విభాగం నుంచి 'డి అండ్ ఒ' ట్రేడ్ లైసెన్సును పొందాలి. అనంతరం ఏటా లైసెన్సుదారులు నిర్ణీత ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. ✦ భీమవరం వెంకట్రామా థియేటర్ రోడ్డు, మావుళ్లమ్మ గుడి పరిధిలో అధికంగా దుకాణాలున్నాయి. అక్కడి వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్సును పురపాలక ఉద్యోగులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు వసూలు చేసి, రసీదు ఇవ్వకుండా పుస్తకంలో రాసుకుంటున్నారు. ఏడాదికని లైసెన్సు ఫీజు చెల్లిస్తే కొన్ని నెలల వ్యవధిలో మళ్లీ వస్తారని, ఇటీవల చెల్లించేశాం కదా అంటే బకాయి మీ పేరున ఉందంటూ వసూలు చేసుకుపోతుంటారని వ్యాపారులు వాపోతున్నారు. భీమవరంలో ఓ ఉద్యోగి గత ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన రూ. 2.10 లక్షలు ఖజానాలో జమ చేయలేదు.

దుకాణాల సంఖ్యకు తగ్గట్టుగా ఆదాయం లేదంతే..!.. పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా దుకాణాలున్నాయి దుకాణాల సంఖ్య పెరుగుతుంటే ట్రేడ్ లైసెన్సు ఫీజు మాత్రం మందగిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 20 వేలు దుకాణాలున్నా ఆదాయం తగ్గుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ✦ 2018-19లో రూ. 1.85 కోట్లు ✦ 2022-23లో రూ. 1.63 కోట్లు

పాలకొల్లులో.. పట్టణంలో 1,316 డి అండ్ ఒ ట్రేడ్ లైసెన్సులున్నాయి. ఏటా రూ. 9లక్షల వరకు వసూలు చేయాల్సి ఉండగా డిమాండ్‌కు తగ్గట్టు ఒక్క ఏడాది కూడా పూర్తి చేయడం లేదు. ప్రస్తుతం 2024-25లో ఇప్పటి వరకు రూ. 7.58 లక్షలు వసూలు చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులెందరో పట్టణ పరిధిలో పలు దుకాణాలు, వ్యాపారాలు ప్రారంభించినా వాటికి పన్నులు వేయలేదు.

✷ కొవిడ్ అనంతరం వ్యాపారాలు పెరిగినా ఆదాయం పెరగలేదు. భీమవరం పట్టణంలో 2022-23లో 3,155 దుకాణాల నుంచి రూ. 47 లక్షలు వసూలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ రూ. 45 లక్షలు మించలేదు. ఏసీ సౌకర్యం కలిగిన దుకాణాలకు రూ. 8 వేలు నుంచి రూ. 10 వేలు, బంగారం దుకాణాలకు రూ. 10 వేలు నుంచి రూ. 15వేలు, చిన్నపాటి దుకాణమైతే రూ. వెయ్యి వరకు వసూలు చేస్తారు.

✦ అనధికారిక వసూళ్లపై క్షేత్రస్థాయిలో విచారణ చేయిస్తాను. పూర్తి వివరాలు తీసుకోవాలని పట్టణ అధికారులకు సూచిస్తాను.

\- నాగ నరసింహారావు, పురపాలక ప్రాంతీయ సంచాలకుడు

ప్రకృతి సాగు.. ఇదీ మేలు!

☛ పరిశీలించిన నీతి ఆయోగ్ బృందం ☛ జిల్లాలో సుడిగాలి పర్యటన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నీతి ఆయోగ్(వ్యవసాయం) బృందం జిల్లాలో సుడిగాలి పర్యటన చేసింది. ఆచార్య డాక్టర్ రమేశ్ చంద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులు గురువారం ఏలూరు గ్రామీణ మండలం వెంకటాపురంలో పర్యటించారు. అక్కడి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన తలారి జ్యోతి, నాగమణి, జయరాజు పొలాల్లో సేద్య విధానంలో అనుసరిస్తున్న వరి కాంపాక్టు బ్లాక్‌లను సందర్శించారు. 10 మంది రైతులు 16 ఎకరాల విస్తీర్ణంలో ఎలాంటి రసాయనాలు వాడకుండా పంటలు పండించిన విధానాన్ని తెలుసుకున్నారు. సంప్రదాయ రసాయన, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల వ్యత్యాసాలపై ఆరా తీశారు. వరిలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం ఆర్జిస్తున్నట్లు గమనించారు. గ్రామంలోని మహిళా సంఘాల ప్రతినిధులతో చర్చించారు. సేంద్రియ ఉత్పత్తుల విక్రయాలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం వట్లూరులోని టీటీడీసీ భవనంలో బృంద సభ్యులు రైతులతో సమావేశమయ్యారు. ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. కార్యనిర్వాహక సంచాలకులు శామ్యూల్ ఆనంద్, సీనియర్ కన్సల్టెంట్ డి.వి.రాయుడు, ప్రసాద్, సీనియర్ మాటెక్ లీడ్ గోపిచంద్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డీపీఎం తాతారావు, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఏడీఏ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



కషాయాలు పరిశీలిస్తున్న రమేశ్ చంద్ బృందం

అడుగడుగునా ప్రతిబంధకాలు

ఆదిశక్తి రూపాలు..

బాలికలు.. ఆదిశక్తి రూపాలు.. భూమాత సహనానికి సాక్ష్యాలు.. చిగురించే మొక్కలు.. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారు. కానీ ముక్కుపచ్చలారని చిన్నారులు మూడు ముళ్ల బంధంలో ఇరుక్కుంటున్నారు. కామాంధుల ఉచ్చుల్లో వారి భవిత సమిధవుతోంది. చివరకు చదువులోనూ వివక్షకు గురవుతున్నారు.

\- ఈనాడు, ఏలూరు

ఎందరో పుత్తడి బొమ్మలు.. ఉమ్మడి జిల్లాలో ప్రజల్లో చైతన్యం ఉన్నా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల మొదలు పట్టణాల్లో సైతం బాల్య వివాహాలు జరుగుతున్నాయి. గత అయిదేళ్లలో 751 బాల్య వివాహాలను అధికారులు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా జరిగినవి వేలల్లో ఉంటాయి.

5-17 ఏళ్ల వయస్సు లోపు బాలికల వివరాలు

0-5	1,97,927
5-10	1,22,156
10-15	1,39,022
15-17	44,480

మధ్యలోనే చదువుకు స్వస్తి

మూడేళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో 28,014 మంది 8వ తరగతి విద్యార్థులున్నారు. వారు తొమ్మిదో తరగతికి వచ్చే సరికి ఆ సంఖ్య 26,120కు తగ్గింది. ఈ సంఖ్య ఇంటర్ పూర్తివచ్చే సరికి మరింత పడిపోతోంది. ఆర్థిక భారం, వివాహాలు చేయడం, ఇతర కారణాలతో ఇలా ఏటా చదువు మానేస్తున్న బాలికల శాతం తగ్గిపోతోంది.




ఆగని బాల్య వివాహాలు, అత్యాచారాలు

నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం

కామాంధుల చేతుల్లో విలవిల.. ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లుగా దాదాపు 30 మంది వరకు బాలికలపై అత్యాచారాలు జరిగాయి. ● ఏలూరు అమీనాపేటలోని బాలికల వసతి గృహంలో యాజమాన్యానికి చెందిన ఓ వ్యక్తి బాలికలను లైంగికంగా వేధించడం కలకలం రేపింది. ● దెందులూరు మండలానికి చెందిన బాలికపై ఓ వ్యక్తి అయిదు నెలలుగా అత్యాచారం చేసి గర్భిణిని చేశారు. ● ఆకివీడు మండలం పెదకాపవరంలో ఇద్దరు స్నేహితులు ఓ బాలికను మాయమాటలు చెప్పి అత్యాచారం చేశారు. ఇలాంటి అఘాయిత్యాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

సంవత్సరాల వారీగా ఉమ్మడి జిల్లాలో గుర్తించిన బాల్య వివాహాలు



'ఉపాధి'కి ప్రణాళికలు

పనుల గుర్తింపునకు గ్రామసభలు

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: వలసల నివారణ, సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతికి చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26లో మరిన్ని పనులు కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అక్టోబరు 2 నుంచి జిల్లాలోని ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి పనులు గుర్తిస్తున్నారు.



జిల్లాలో ఇలా..

జిల్లాలో ఏటా ఉపాధి కూలీల సంఖ్య పెరుగుతోంది. 2023-24లో 1.05 లక్షల మంది పనులు చేశారు. 2024- 25లో 1.60 లక్షల మందికి పనులు కల్పించాలని లక్ష్యం పెట్టుకోగా సెప్టెంబరు నాటికి 185 కుటుంబాలు వంద రోజుల పనులు పూర్తి చేశాయి. వచ్చే ఏడాది ఇంకా ఎక్కువ పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో ఏపీవోలు, సీసీలు.. రైతులు, కూలీలతో గ్రామసభలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పనులు గుర్తిస్తున్నారు. వాటిని గ్రామసభలో తీర్మానించి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. అవి డిసెంబరులో మండల, జిల్లా పరిషత్తుల ఆమోదం పొందాల్సి ఉంటుంది.

వీటికి ప్రాధాన్యం.. మొత్తం 423 రకాల పనులకు అవకాశం ఉండగా.. జల సంరక్షణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. చెరువులు, కుంటల్లో పూడికతీత, ఇంకుడు, నీటి గుంతల తవ్వకాలను గుర్తిస్తున్నారు. వీటితో పాటు సహజ వనరుల యాజమాన్య పనులు, వ్యవసాయ ఆధారిత, మౌలిక వసతులు, జీవనోపాధి పనులు చేపట్టేలా చూస్తున్నారు. ప్రతి కూలీకి వందరోజుల పని కల్పించేందుకు అవసరమయ్యే ఖర్చు వివరాలను గ్రామసభల్లో తీర్మానించి సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

నెలాఖరులోపు సభలు పూర్తి.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చిలో ముగియనున్న నేపథ్యంలో 2025-26లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. మున్సిపాలిటీల్లో విలీనమైన పంచాయతీలను మినహాయించి జిల్లాలో 409 గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తిచేసి నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులకు, వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపిస్తారు.

ఏదీ అలనాటి సౌరభం?

నిరుపయోగంగా రూ.కోట్ల విలువైన ప్రాజెక్టు

భీమవరం మండలంలో లోసరి పంట కాలువపై 2016లో రూ. 7.31 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు ప్రాజెక్టు ఇది. ఈ తరహా ప్రాజెక్టుల్లో ఇది దేశంలో రెండోది. దక్షిణాది ఇదే తొలి ప్రాజెక్టు కావడం విశేషం. నిర్వహణ లేమితో ఏడాదిన్నర నుంచి ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మిగిలింది. ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతను నెడ్‌క్యాప్ బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించగా ఆ సంస్థ మరో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది





వృథాగా ఖరీదైన యంత్రాలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం సమీపాన లోసరి పంటకాలువపై తొమ్మిదేళ్ల కిందట నిర్మించిన సౌర విద్యుత్తు కేంద్రం ద్వారా నిత్యం 3,500 యూనిట్లు ఉత్పత్తి చేసి సమీపాన ఉన్న గొల్లవానితిప్ప ఉపకేంద్రానికి సరఫరా చేసేవారు. దీని నిమిత్తం విద్యుత్తుశాఖ సొమ్ము చెల్లించేది. ఈ కేంద్రంలో బ్రేకర్‌లో సమస్య తలెత్తి ఏడాదిన్నరగా విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో ఎంతో ఖరీదైన పరికరాలు మూలనపడ్డాయి. కాలువపై ఏర్పాటు చేసిన సౌరఫలకాలు దెబ్బతింటున్నాయి. కాలువకు ఇరువైపులా పొదలు పెరిగి ఫలకాలను కమ్మేశాయి. ఈ కేంద్రంలో ఉత్పత్తి మాట పక్కన పెడితే నిర్వహణకు ప్రతి నెలా 1000 నుంచి 2000 యూనిట్ల విద్యుత్తును బయటి నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన దస్త్రాన్ని ఉన్నతాధికారులకు పంపినట్లు నెడ్‌క్యాప్ జిల్లా అభివృద్ధి అధికారి హరీశ్ తెలిపారు. ఇటీవల బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులు వచ్చి పరిశీలించారని, త్వరలోనే ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు

పెనుమంట్ర, అత్తిలి గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ కలగనుంది. ఆయా కేంద్రాల్లో వైకాపా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకపోవడంతో చిన్నారులు అసౌకర్యాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీటికి చెక్ పెట్టాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో సొంత భవనాలుండి మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయాలు లేనివాటిని అధికారులు గుర్తించారు. వాటి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనున్నారు. ఒక్కో కేంద్రంలో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 36 వేలు, తాగునీటి సౌకర్యం కల్పనకు రూ. 17 వేలు చొప్పున మంజూరు చేసింది. జిల్లాలో రూ. 77 లక్షల వ్యయంతో 286 చోట్ల ఈ పనులు చేపట్టనున్నారు. 'త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం' అని ఐసీడీఎస్ పీడీ సుజాతరాణి వివరించారు.

జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు	1626
నూతనంగా నిర్మించే మరుగుదొడ్లు	150
తాగునీటి సౌకర్యం కల్పించే కేంద్రాలు	136
ఈ రెండింటికి కేటాయించిన నిధులు	రూ.77 లక్షలు

ఆకాశమే హద్దుగా..! | 4లో | 'చంద్రబాబుతోనే ఎస్సీ వర్గీకరణ'
ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల?

ఉల్లి రూ.70.. వెల్లుల్లి రూ.400

మండవల్లి, న్యూస్‌టుడే: ఉల్లి, వెల్లుల్లి ధరలు ఆకాశాన్ని అంటుతూ వినియోగదారుల కళ్లల్లో నీళ్లను రప్పిస్తున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉల్లి కిలో రూ. 70కు చేరింది. దీనికి వెల్లుల్లి తోడైంది. కిలో రూ. 400 పలుకుతోంది.

రెండు నెలలుగా పెరుగుతూనే.. రెండు నెలలుగా ఉల్లి ధర వినియోగదారుల్లో గుబులు రేపుతోంది. ఆగస్టులో రూ. 50, సెప్టెంబరులో రూ. 60, అక్టోబర్‌లో రూ. 70 మార్కును చేరుకున్నాయి. ధరల పెరుగుదలతో కేజీ కొనాల్సిన వారు అర కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. మార్కెట్లో రెండు రకాల ఉల్లిపాయలు లభిస్తున్నాయి. రెండో రకం ఉల్లినే రైతు బాజార్‌లో రూ. 60లకు అమ్ముతున్నారు.





ధర కిలో (రూ.లలో)	ఉల్లి (ప్రస్తుత ధరలు)	ఉల్లి (4 నెలల కిందట)	వెల్లుల్లి (ప్రస్తుత ధరలు)	వెల్లుల్లి (4 నెలల కిందట)
రైతు బజార్	65	20	360	200
టోకున అమ్మకాలు	60	25	350	220
బయట మార్కెట్	70	28	400	320

విద్యా కేంద్రాలే లక్ష్యంగా..!

యథేచ్ఛగా గంజాయి రవాణా

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:

విక్రయాలు చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. యువతను, విద్యా కేంద్రాలే లక్ష్యంగా చేసుకుని గంజాయి మాఫియా కార్యకలాపాలు సాగిస్తోంది. ఒడిశా, విశాఖ మన్యం ప్రాంతాల నుంచే ఎక్కువగా జిల్లాకు గంజాయిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.



తణుకు : పోలీసుల అదుపులో గంజాయి ముఠా (పాత చిత్రం)

గతేడాది జిల్లాలో నమోదైన కేసులు	53
అరెస్టయిన వారు	236

✦ ఇటీవల గంజాయి రవాణా చేస్తున్న 15 మందిని కృష్ణా జిల్లా, పెదపారుపూడిలో అరెస్టు చేశారు. వీరిలో సగం మంది ఏలూరు, భీమవరం ప్రాంతానికి చెందినవారే. వారి నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరులో కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

✦ విశాఖపట్నం నుంచి ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకొస్తున్న కొందరు యువకులను గతంలో పెనుమంట్ర పరిధిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లోని సాంకేతిక, వైద్య, డిగ్రీ కళాశాలలు ఉన్న ప్రాంతాలపై గంజాయి ముఠాలు దృష్టి సారిస్తున్నాయి. భీమవరంలోని ఓ కళాశాలకు చెందిన కొంత మంది విద్యార్థుల వద్ద గంజాయి పొట్లాలను పోలీసులు గుర్తించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గతేడాది భీమవరం ఒకటో పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేశారు.

ఎక్కడ నుంచైనా గత వైకాపా హయాంలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు సాగించారు. యువత వాటికి బానిసలుగా మారి ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకున్న ఘటనలు చాలానే ఉన్నాయి. ప్రస్తుతం పోలీసు దాడులతో కొంతమేర తగ్గినా రవాణాకు కొత్తదారులు వెతుకుతున్నారు. గంజాయి నివారణకు చర్యలు చేపడతామని, దీనిపై ఎవరైనా సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ నయీంఅస్మి తెలిపారు.

నిర్ణీత ధరలకే సరకులు : కలెక్టర్

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పౌరసరఫరాలు-మార్కెటింగ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో భీమవరంలో ఏర్పాటు చేసిన సరకులు విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కూరగాయలు, ఇతర సరుకుల ధరలు బాగా ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం తరపున జిల్లాలోని అన్ని రైతుబజారుల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో రాయితీపై టమాటాలు, ఉల్లిపాయలు, వంట నూనెలను విక్రయించేలా ఈ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కేజీ టమాటా రూ. 50కి, ఉల్లిపాయలు కర్నూలు రకం కేజీ రూ. 32, మహారాష్ట్ర రకం రూ. 47కి, పామాయిల్ 800గ్రాముల ప్యాకెట్ రూ. 119, సన్‌ఫ్లవర్ 910 గ్రాముల ప్యాకెట్ రూ. 127కి విక్రయించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారు ఆధార్, రేషన్‌కార్డుల్లో ఏదో ఒకటి తీసుకుని ఒక కేజీ చొప్పున కొనుగోలు చేయొచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల డీఎం శివరామప్రసాద్, డీఎస్‌వో సరోజ, మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరాణి, ఎమ్మెల్యే రామాంజనేయులు

రతన్‌టాటా మరణించినా జీవించే ఉంటారు: రఘురామ

కాళ్ల, ఉండి, న్యూస్‌టుడే: మరణించిన తర్వాత కూడా జీవించే ఉండే అతి కొద్ది మందిలో రతన్‌టాటా ఒకరని, ప్రపంచం గుర్తించిన దిగ్గజ పారిశ్రామిక వేత్త, మానవతావాదని, ఆయన సేవలతో దేశ కీర్తిప్రతిష్ఠలు మరింత ఇనుమడించాయని ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. గురువారం పెదఅమిరంలోని కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'రతన్‌టాటా సేవలను సేవలను ఎన్నో దేశాలు గుర్తించి సత్కరించాయి. కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్, పద్మవిభూషణ్ పౌర పురస్కారాలను అందజేశాయి. భారతరత్న ఇవ్వాలని ప్రధానమంత్రిని రెండు సార్లు కోరాను. కోట్ల రూపాయలున్నా సాధారణ జీవితం గడిపారు. ఆయన జీవితం నేటియువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. ఉప్పు నుంచి విమానయానం వరకు అన్ని రంగాల్లోనూ తమదైన ముద్ర వేశారు. ఆయన్ని మూడుసార్లు కలిసే అవకాశం నాకొచ్చినందుకు ఎంతో గర్వపడుతున్నా' అని అన్నారు.

ప్రకృతి.. గజముఖాకృతి!



పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రకృతిని పరిశీలిస్తే ప్రతీది పరవశమే. చెట్లకు వేలాడే ఊడలు, అల్లుకునే పాదులు కొన్నిచోట్ల వివిధ ఆకృతుల్లో దర్శనమిస్తుంటాయి. మార్టేరు-పాలకొల్లు ప్రధాన రహదారిలో జగన్నాథపురం దగ్గర ఒక చెట్టుకు అంతెత్తున అల్లుకున్న పాదు ఏనుగు తొండం పైకెత్తిన ఆకారంలో కనిపిస్తుంది. అటుగా వెళ్తున్న వారికి ఈ గజముఖ ఆకృతి నీడనిచ్చే గొడుగులా మారిన తరుణంలో 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

ఆకాశమే హద్దుగా..!

ఇష్టమైన రంగాల్లో రాణిస్తున్న బాలికలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

బాలికల్లో ఆసక్తిని గమనించి భుజం తడితే ఆకాశమే హద్దుగా ప్రతిభ కనబరుస్తారు అనడానికి ఈ చిన్నారులే ఉదాహరణ. బాలికల ఉత్సాహానికి తల్లిదండ్రుల సహకారానికి గురువుల ప్రోత్సాహం తోడైంది. ఒక్కొక్కరు తమకిష్టమైన రంగాల్లో వివిధ స్థాయిల్లో రాణిస్తూ ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటున్నారు. బాలురతో సమానంగా వీలైతే అంతకంటే మిన్నగా ప్రోత్సహిస్తే ప్రావీణ్యం సాధిస్తారని నిరూపిస్తున్నారు.

ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని..



'ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పటి నుంచి వాలీబాల్ సాధన చేస్తున్నా. గతేడాది రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యా. ఈ ఏడాది అండర్-17లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యా. వ్యవసాయ కూలీ కుటుంబం మాది. క్రీడల్లో బాగా సాధన చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా కోరిక' అని రాజవరం విద్యార్థిని వై.సుష్మ చెప్పారు.

ఆసనాలు.. అలవోకగా..



'కొయ్యలగూడెం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. మాది మధ్య తరగతి కుటుంబం. చదువుతున్న పాఠశాలలోనే శిక్షణ పొందుతూ 40 వరకు యోగాసనాలు వేస్తా. పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యా. క్రీడల్లో రాణించి వ్యాయామ ఉపాధ్యాయినిగా ఉద్యోగం సాధించాలన్నదే నా ఆకాంక్ష' అని ఎం.యామినీదేవి పేర్కొన్నారు.

నృత్యంలో భళా..



'ఆరో ఏట నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నా. తండ్రి కొయ్యలగూడెంలోని ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు. రాష్ట్ర స్థాయిలో విజయవాడ, గుంటూరు, జాతీయస్థాయిలో మహారాష్ట్రలోని శిర్డీ, కేరళలో నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నా. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో 23 వరకు ప్రదర్శనలతో జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నా. విజయవాడ, వారణాసిల్లో జరిగిన గిన్నిస్ ప్రపంచ రికార్డు ప్రదర్శనలో పాల్గొని ధ్రువపత్రాలు సొంతం చేసుకున్నా. నృత్యంలో మరింత రాణించాలన్నదే నా అకాంక్ష' అని చత్రాతి రూపిక తెలిపారు.

విజయం వైపు పావులు కదుపుతూ..

'ఎనిమిదేళ్ల వయసులో చదరంగంపై ఆసక్తి కలిగింది. మాది జంగారెడ్డిగూడెం. తొమ్మిదో తరగతి చదువుతున్నా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో 72 పోటీల్లో పాల్గొని బహుమతులు, పురస్కారాలు సొంతం చేసుకున్నా. ఏలూరు జిల్లా అండర్-17 బాలికల ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ 2024, ఆంధ్రప్రదేశ్ అండర్-13 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ 2023, ఏపీ స్టేట్ స్కూల్స్ వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్-2023 అండర్-13, జిల్లా గ్రంథాలయ సంస్థ పోటీల్లో ప్రథమ స్థానం సాధించా. అంతర్జాతీయ క్లాసికల్ రేటింగ్ 1457, ర్యాపిడ్ రేటింగ్ 1463, బ్లిట్జ్ రేటింగ్ 1431 పాయింట్లు సాధించా. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా లక్ష్యం' అని శ్రీమణికార్తిక తెలిపారు.



మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



ఆలయాధికారికి బంగారం అందజేస్తున్న రవికుమార్‌రాజు కుటుంబ సభ్యులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గురువారం ఆలయ కళా వేదికపై చండీ హోమం, సామూహిక దంపతులతో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనం అనంతరం విజయవాడకు చెందిన నాట్యాంజలి కూచిపూడి నిత్య నిలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి స్వర్ణ వస్త్రనిధి నిమిత్తం ఈలంపూడి గ్రామానికి చెందిన అల్లూరి రవికుమార్‌రాజు దంపతులు 16 గ్రాములు బంగారం ఆలయ సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ అందించారు. వారికి ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ అమ్మవారి ఆశీర్వాదం, ప్రసాదం అందించారు.

క్రమబద్ధీకరణ పత్రాల అందజేత



ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన పలువురు టైపిస్టులకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం క్రమబద్ధీకరణ పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ... సీపీటీలో ఉత్తీర్ణత సాధించిన టైపిస్టులకు మొదటగా విధుల్లో చేరిన తేదీ నుంచి రెగ్యులర్ టైపిస్టులుగా నిర్ణయించి సిబ్బందికి ఉత్తర్వులు అందజేశామన్నారు. జడ్పీ సీఈవో కేవీఎస్ సుబ్బారావు తదితరులున్నారు.

పంట రుణాల రీషెడ్యూల్‌కు అవకాశం: కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భారీ వర్షాలు వరదలతో జిల్లాలో పంట దెబ్బతిన్న రైతులకు వారు తీసుకున్న పంట రుణాలను రెండేళ్ల వరకు రీషెడ్యూల్ చేసుకోనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. అలా చేసుకున్న రైతుల నుంచి జరిమానా వడ్డీ వసూలు చేయడం ఉండదన్నారు. ఈ సౌకర్యం వర్తించాలంటే పంట రుణం చెల్లించే గడువు దాటిపోయి ఉండకూడదని వెల్లడించారు. పంట రుణాలు తీసుకున్న బ్యాంకులను సంప్రదించి రుణాలను రీషెడ్యూల్ చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ

చాగలమర్రి, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా వైజాగ్ జట్టు నిలిచింది. గురువారం వైజాగ్-పశ్చిమగోదావరి జిల్లాల జట్లు ఫైనల్ పోటీల్లో తలపడ్డాయి. మూడు పాయింట్ల ఆధిక్యంతో పశ్చిమగోదావరిపై వైజాగ్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. పశ్చిమగోదావరి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. మూడో స్థానంలో ఉమ్మడి విజేతగా కర్నూలు, సత్యసాయి జిల్లా జట్లను ప్రకటించారు.

చంద్రబాబుతోనే ఎస్సీ వర్గీకరణ

తణుకు చేరిన ఎమ్మార్పీఎస్ కృతజ్ఞత యాత్ర



ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. మాదిగలకు అండగా నిలిచిన చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన కృతజ్ఞత యాత్ర గురువారం ఉదయం తణుకు చేరింది. ముందుగా స్థానిక అంబేడ్కర్ భవనంలో మాదిగ నాయకులతో వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించి కరత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ పార్కు వద్ద అంబేడ్కర్, జగ్జీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమలు చేయాలని కోరారు. అలాగే మాదిగ, ఉపకులాల నిరుద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వృత్తినైపుణ్య శిక్షణ ఇప్పించి జీవన భృతికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజన్‌రావు, నాయకులు చదలవాడ నాని తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకారం: జేసీ



ఇండోర్ స్టేడియం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, రాహుల్‌కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రానున్న అయిదేళ్లలో రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తాడేపల్లిగూడేన్ని తీర్చిదిద్దేందుకు సహాయ సహకారాలు అందిస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలో అపరిష్కృతంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియంలను ఆయన ఎమ్మెల్యే బొలిశెట్టితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హబ్‌గా మారిన తాడేపల్లిగూడెంలో స్టేడియం అవసరం ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సగటు వర్షపాతం 15.7 మి.మీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు సగటు వర్షపాతం 15.7 మి.మీగా నమోదైంది. అత్యధికంగా ఆకివీడులో 40.2 మి.మీ. కురిసింది. తణుకులో 31.2, వీరవాసరంలో 30.4, ఆచంటలో 30.2, పెనుగొండ 27.8, పెనుమంత్ర 24.6, గణపవరం 22.6, ఉండి 17.4, ఇరగవరం 16.6, భీమవరం 13.2, పాలకోడేరు 12.4, కాళ్ల 10.0మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో పది మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షం కురిసింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

దేవరపల్లి, న్యూస్‌టుడే: బ్యాంక్ పని మీద వెళ్లి రహదారి దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన చక్క కాశీవిశ్వనాథం(71) రెండేళ్లుగా తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. గురువారం ఉదయం బ్యాంక్ పని మీద మండలంలోని యర్నగూడెం వెళ్లారు. రోడ్డు దాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనగా తలకు బలమైన గాయమైంది. స్థానిక తెదేపా నేత పెన్మత్స సుబ్బరాజు అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యుదాఘాతంతో..

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో గురువారం విద్యుదాఘాతానికి గురై వృద్ధుడు మృతి చెందారు. స్థానిక ఎస్సై ఎం.రవివర్మ తెలిపిన వివరాల ప్రకారం అత్తిలి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన భీమవరపు వెంకటశేషారావు(61) గొల్లలకోడేరులో వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. వృత్తిపనిలో భాగంగా ఉదయం వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పిపోవడంతో స్థానికులు 108 వాహనంలో భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధరించారు. మృతుడు కుమారుడు వసంతరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల?

రూ.లక్షలు గుంజుతున్న ముఠా

పోలవరం, న్యూస్‌టుడే: మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో సూపర్‌వైజర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇప్పిస్తామంటూ పోలవరం తదితర మండలాలకు చెందిన ముఠా ఒకటి ఏజెన్సీ గ్రామాల్లోని నిరుద్యోగులపై వల వేసినట్లు తెలిసింది. సూపర్‌వైజరుతో పాటు సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.3.50 లక్షలు, జూనియర్ అసిస్టెంట్ రూ.2.50 లక్షలు అవుతుందని, అడ్వాన్సుగా రూ.లక్ష ఇస్తే నియామక ఉత్తర్వుల లేఖ అందాక మిగిలిన సొమ్ము చెల్లించొచ్చని ముఠా సభ్యులు నమ్మిస్తున్నారు. ఇప్పటికే పోలవరం మండలానికి చెందిన కొందరు యువకులు కొంత మొత్తం చెల్లించినట్లు తెలిసింది. మరికొందరు నగదు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఐసీడీఎస్‌లో ఉద్యోగాల విషయమై కొయ్యలగూడెం సీడీపీవోను సంప్రదించగా పోలవరం మండలంలో రెండు సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే మహిళల్లో సీనియారిటీ ప్రకారం ఎంపిక చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రకటన మేరకే నియామకాలు చేపడతారన్నారు. ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తారన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అసలు నేరుగా నియామకాలు చేపడతారనడం పూర్తిగా అవాస్తవమన్నారు. మోసపూరిత వ్యక్తుల మాటల విషయంలో నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

మనస్తాపంతో ఆత్మహత్య

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మాదివాడ ప్రాంతానికి చెందిన ఇంటి వినయ్‌కుమార్ (32) ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల మేరకు వినయ్ కుమార్ సుమారు ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. గురువారం ఉదయం తండ్రి విజయ్‌రాజు చూసి విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భీమవరం

• భీమవరం • ఉండి

మానసిక దివ్యాంగులను హేళన చేస్తే చర్యలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. శాంతి మానసిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సదస్సులో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్ మాట్లాడారు. మానసిక దివ్యాంగుల పట్ల ఓర్పు, సహనంతో మెలగాలన్నారు. వారిని హేళన చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారన్నారు. వైద్యులు జి.వి రమణరావు, జి.సుభాష్, ప్యానల్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పాలకోడేరు, న్యూస్‌టుడే: గొల్లలకోడేరు విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్తు తీగలను ఆనుకుని ఉన్న చెట్లు, కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నట్లు భీమవరం ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. పాలకోడేరు గ్రామంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: యండగండిలోని 33/11 కేవీ ఉపకేంద్రానికి వెళ్లే 33 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మల తొలగించే పనులు ఈనెల 11న జరుగుతున్నాయని విద్యుత్తు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో యండగండి, ఉణుదుర్రు గ్రామాలకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.



తపాలాశాఖ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు, సిబ్బంది

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని తపాలాశాఖ డివిజన్ సహాయ సూపరింటెండెంట్ అల్లు సురేష్ అన్నారు. గురువారం తపాలాశాఖ వారోత్సవాల్లో భాగంగా సంస్థ కార్యాలయంలో తమ సిబ్బందితో పాటు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో పూల మొక్కలను నాటినట్లు విజ్ఞాన వేదిక కన్వీనర్ సీహెచ్.రంగసాయి తెలిపారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ రామభద్రిరాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎంవీరమణ పలువురు తపాలాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏదీ పర్యవేక్షణ.. శుభ్రత?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

భీమవరాన్ని సుందర పట్టణంగా తీర్చిదిద్దాలని ఉన్నతాధికారులు సంకల్పించారు. జిల్లా కేంద్రమైన భీమవరానికి నిత్యం ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అందమైన పట్టణంగా కనిపించేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇదే విషయమై సంయుక్త కలెక్టర్, పట్టణ ప్రత్యేకాధికారి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కూడా పురపాలక అధికారులతో సమీక్షను బుధవారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నిఘా ఉంచితే అభివృద్ధి జాడలుంటాయి. లేకపోతే స్వచ్ఛత పనులను కూడా మమా అనిపిస్తారు.

ఏటా రూ.40 లక్షలు

డ్రెయిన్లలోని మురుగు తీయడానికి ఏటా రూ.40 లక్షలు కేటాయిస్తున్నారు. అయినా ఏమాత్రం శుభ్ర పడటంలేదు. ముంపు బారిన పడిన ప్రాంతాలను ప్రస్తుత కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పరిశీలించారు. డ్రెయిన్లు ఉన్నా ముంపు కారణాలు తెలుసుకున్నారు. ఆయా డ్రెయిన్లలో తీయిస్తుంటే కొన్నిరోజులుగా తరగడంలేదు. అంటే కొన్నేళ్లుగా కంపులో కాసులు కక్కుర్తి జరిగిందనేది బహిర్గతమవుతోంది. దాంతో ప్రత్యేక సిబ్బందితో తొలగింపు పనులు చేస్తున్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

మూలకు చేర్చారు

గత ప్రభుత్వ పాలనలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి చెత్త తొట్టెలు, కాంపాక్టర్లు అందుబాటులోకి తెచ్చారు. వాటిలో చాలా మూలకు చేరాయి. చెత్త సేకరించేందుకు, వేసేందుకు డబ్బాల్లేవు. శాశ్వత ఉద్యోగులు 100 మంది. ప్రైవేటు పారిశుద్ధ్య కార్మికులు 274 మందిగా లెక్కలు చెబుతున్నారు. వారిలో ఎంత మంది విధుల్లో పాల్గొంటున్నారో, రోజూ ఇంటింటా చెత్త సేకరణ ఎలా ఉందో పర్యవేక్షణ ఉండాలని ప్రజలు సూచిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో స్వచ్ఛతకు చర్యలు చేపట్టామని సహాయ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వరరావు చెప్పారు. వార్డుల్లో నిత్యం పరిశీలించి శుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు.



భీమవరం బలుసుమూడి వెళ్లేదారిలో డ్రెయిన్‌లో చెత్త



శ్రీరామపురంలో చెత్తలో కలుస్తున్న ఇనుప డబ్బాలు

ఏళ్లుగా ఇదే తంతు

భీమవరం 1.63 లక్షల జనాభాతో 39 వార్డుల్లో విస్తరించింది. ఇళ్ల నుంచి ఉత్పత్తి అవుతున్న చెత్త రెట్టింపు అవుతోంది. వీధులు, డ్రెయిన్లు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. వాటిని శుభ్రం చేసే కార్మికుల సంఖ్యలో ఎలాంటి మార్పులు జరగడంలేదు. ఏళ్లుగా ఇదే తంతుతో అపరిశుభ్రంగా ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467

కాళ్ల : 80085 74474

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: బలుసుమూడి నుంచి కొమరాడ వెళ్లే దారి పక్కన ఉన్న ప్రధాన డ్రెయిన్ గడ్డితో కప్పి ఉంది. మురుగు వెళ్లే అవకాశం లేక పల్లపు ప్రాంతాలు ముంపులోకి చేరుతున్నాయి

- రామకృష్ణ, రవికుమార్, స్థానికులు

సమస్య: డీఎన్నార్ కళాశాల కూడలి దగ్గర వేస్తున్న చెత్తను సకాలంలో తీయడంలేదు. ఆ ప్రాంతం దుర్వాసన వస్తోంది.

- చంద్రమోహన్, ప్రైవేటు ఉద్యోగి

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తా. చెత్త ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి పనులు చేయిస్తాను.

- శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

రాష్ట్రీయ రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

కోలమూరు(ఉండి), న్యూస్‌టుడే : ఉండి - చేబ్రోలు రాష్ట్రీయ రహదారిలో కోలమూరు ప్రాంతంలో మరమ్మతుల పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈనెల ఏడో తేదీన ఈ రహదారి దయనీయ స్థితిపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఆశాఖ అధికారులు స్పందించారు. రహదారి మరమ్మతులు పనులు రూ.10 లక్షలతో ప్రారంభమయ్యాయని ఆర్ అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు తెలిపారు.

ఉండిలో శ్రీచక్ర కుంకుమ పూజలు



ఉండి, న్యూస్‌టుడే: ఉండి బాలాజీరావుపేటలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని కనకదుర్గమ్మ ఆలయంలో శ్రీచక్ర కుంకుమ పూజలు ఘనంగా సాగాయి. ఆలయ యువజన కమిటీ నేతృత్వంలో నల్లా విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత నల్లా కిరణ్ ప్రసాద్ దంపతుల సహకారంతో సుమారు 200 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. శరన్నవరాత్రి వేడుకలు మండలంలోని వేర్వేరు ఆలయాల్లో ఘనంగా జరిగాయి.

ఘనంగా అజ్జాలమ్మ జాతర..ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామ దేవత అజ్జాలమ్మ జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ నెల 12 వరకు జాతర కొనసాగనుంది.

కనకదుర్గమ్మా.. రక్ష రక్ష!



భీమేశ్వరాలయంలో మహిషాసురమర్దని



నాచువారి కూడలిలో..



వీరవాసరం: దుర్గాదేవిగా..



కాళ్లకూరులో గాయత్రీదేవిగా..



ఆకివీడు: పెద్దింట్లమ్మ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో పలు ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గురువారం భీమేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దని అమ్మవారు దుర్గాదేవిగా, గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో పార్వతీదేవి దుర్గాదేవిగా, నవ దేవతగా అన్నపూర్ణమ్మ దర్శనం ఇచ్చారు. రెండోపట్టణం గొల్లవానితిప్ప రోడ్డులో దుర్గాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు, మెంటేవారితోట బాలా త్రిపురసుందరి ఆలయం చండీహోమం నిర్వహించారు. త్యాగరాజ భవనంలో వాసవీమాత ఆలయంలో విజయదుర్గ, నాచువారి కూడలిలో కనకదుర్గ ఆలయంలో నవదుర్గలు అలంకరణలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఆకివీడు, వీరవాసరం, కాళ్లకూరు, న్యూస్‌టుడే: ఆకివీడు గ్రామ దేవత పెద్దింట్లమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు.



కలెక్టర్ నాగరాణి, విశ్రాంత జేసీ వెంకటరామిరెడ్డి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయాధికారి

ఆలయాల్లో కలెక్టర్ పూజలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయం, పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయాలను గురువారం కలెక్టర్ నాగరాణి, విశ్రాంత జేసీ పి.వెంకటరామిరెడ్డి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వారికి ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, వేద పండితులు అమ్మవారి ఆశీర్వాదం అందించారు. ఆలయ సహాయకమిషనర్ బి.ఎం. నగేష్ శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందించారు. అనంతరం సోమేశ్వరజనార్దనస్వామి ఆలయాన్ని దర్శించిన వారికి ప్రధానార్చకులు సోంబాబు, రామకృష్ణ స్వామివార్ల ఆశీర్వాదం, జిల్లా దేవాదాయశాఖాధికారి ఈ.వి.సుబ్బారావు, ఆలయ ఈవో డి. రామకృష్ణంరాజు శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఆకివీడు, న్యూస్‌టుడే: 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని సహాయ బాల కార్మిక అధికారి ఎం.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం బాల కార్మిక, పోలీస్, విద్యాశాఖాధికారులు సంయుక్తంగా ఆకివీడులోని పలు హోటళ్లు, మెకానిక్, మిఠాయి తదితర దుకాణాలను తనిఖీలు చేశారు. వ్యాపారులకు బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించారు. పోలీస్, విద్యాశాఖాధికారులు ఆర్‌వీఎస్ నారాయణ, బి.శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలో రఘురామ

కాళ్ల, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీసలిలో ఉన్న శీర్డీసాయిబాబా ఆలయాన్ని గురువారం ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దర్శించుకున్నారు. ఆలయ ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మీసత్యవతిదేవి బాబా చిత్రపటం అందించారు. గ్రామానికి చెందిన తెదేపా నాయకులు తోట హరిబాబు, తోట ఫణి ఎమ్మెల్యే పేరున తాము మొక్కుగా ఆయనను పటిక బెల్లంతో తులాభారం వేసి ఆలయానికి సమర్పించారు. ఆలయంలో సేవలు అందిస్తున్న సాయిసేవకులకు చీరలు పంపిణీ అందజేశారు. ఆలయాన్ని నిర్మించిన తోరం త్రినాథ్‌బాబుకు ఎమ్మెల్యే నివాళులర్పించారు. నిర్వాహకులను ఆయన అభినందించారు. మండల తెదేపా అధ్యక్షుడు జీవీనాగేశ్వరరావు, పెదఅమిరం సర్పంచి డి.సోమేశ్వరరావు, నాయకులు వీరవల్లి శ్రీనివాసరావు, బి.పద్రాలు, ఎం.సుబ్బరాజు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయాన్ని కరెన్సీ నోట్లతో నేత్రపర్వంగా అలంకరించారు.



ఎమ్మెల్యేకు తులాభారం వేస్తున్న తెదేపా నాయకులు

అందుబాటు ధరల్లో విక్రయాలు: ఎమ్మెల్యే

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉల్లిపాయలు, టమాటాలు, వంట నూనెలు తదితర నిత్యావసర సరకులను ప్రజలకు అందుబాటు ధరలకే విక్రయించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కనుమూరి రఘు రామకృష్ణరాజు తెలిపారు. చౌక పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆకివీడులో ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక దొరగారి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనులపై, ఆక్రమణలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మార్కెట్ యార్డును పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట తెదేపా మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, గంధం ఉమా, బి.సరళకుమారి, తోట వాసు, ఎం.నాగమణి, నౌకట్ల రామారావు, కమిషనర్ కృష్ణమోహన్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన జేసీ

పాలకోడేరు, న్యూస్‌టుడే: కుముదవల్లిలోని వీరేశలింగ కవి సమాజ గ్రంథాలయాన్ని గురువారం జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశిష్టత, అందుబాటులో ఉన్న పుస్తకాలు, గ్రామస్థుల సహకారం, గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు గురించి కార్యదర్శి భూపతిరాజు నాగేంద్ర వర్మ వివరించారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, పాఠకులకు కల్పించిన సౌకర్యాలను నిశితంగా పరిశీలించిన జేసీ నిర్వాహకులను అభినందించారు.

అప్పుడు రూ.7 లక్షలు.. ఇప్పుడు రూ.20 లక్షలు

ఎన్నేళ్లయినా అభివృద్ధికి నోచని రహదారి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

భీమవరం నుంచి కొమరాడ వెళ్లే రహదారి బలుసుమూడి పరిధిలో అభివృద్ధికి నోచుకోవడంలేదు. రహదారి నిర్మాణానికి రూ.7 లక్షలతో మున్సిపల్ గత పాలకవర్గం హయాంలో టెండరు ఖరారైంది. గుత్తేదారు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి పని నిలిచిపోయింది. కొవిడ్ విజృంభణకు ముందు మళ్లీ పనులు ప్రారంభించారు అంతలోనే కరోనా అడ్డంకులొచ్చాయి. వైకాపా పాలనలో అయితే ఇటు చూసినవారు లేరు.



మట్టిదారిని తలపిస్తున్న బలుసుమూడి రహదారి

అవస్థలు.. వ్యయం అధికం

రహదారి అభివృద్ధి చేసేందుకు 8 ఏళ్ల కిందట పనులు ప్రారంభించారు. రహదారి నిర్మాణం కంటే ముందు మురుగుకాలువ పనులు చేయాలంటూ ఆపేశారు. పట్టణపరిధిలోని మురుగును నేరుగా రాయలం డ్రెయిన్‌లోకి మళ్లించేలా పైపులు అమర్చడానికి రూ.10 లక్షలతో సైఫన్ పనులు చేశారు. తారుతో కాకుండా సిమెంటు రహదారిగా శాశ్వత ప్రాతిపదికన చేయాలని రూ.19 లక్షలతో రహదారి నిర్మాణానికి సంకల్పించారు. గుత్తేదారు మళ్లీ వెనక్కి వెళ్లారు. 140 మీటర్ల పొడవున చేయాల్సిన పనికి ఇప్పుడు రూ.20 లక్షలు కేటాయించారు. భీమవరం గ్రామీణ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి. ఎప్పుడూ మరమ్మతులతో ఉంటుందని, గుంతల్లో పడి గాయపడుతున్నారని రమేష్‌రాజు, రాఘవ చెప్పారు. డ్రెయిన్ కల్వర్టుకు నిర్మించిన సిమెంటు దిమ్మెలను ఢీకొట్టి గాయపడుతున్నారన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపడతామని డీఈ వై.శ్రీను చెప్పారు. గుత్తేదారు నిర్మాణ సామగ్రి దిగుమతి చేశారన్నారు. నాణ్యతతో పనులు పూర్తిచేయించి ప్రయాణికుల అవస్థలు తొలగిస్తామన్నారు.



చింతలకోటిగరువు కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

వీరవాసరం, న్యూస్‌టుడే: బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని నందమూరుగరువు, వీరవాసరం, మత్స్యపురి, చింతలకోటిగరువు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. 'సుస్థిర అభివద్ధి సామర్థ్యాల పెంపు' నినాదంతో బాలికల అభివృద్ధి కోసం కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. బాలికల వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

బాలికలకు విద్య అవసరం

కొవ్వాడ(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం కొవ్వాడ పంచాయతీలోని వెల్టూరు అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ దిర్సుమర్రు సెక్టార్ పర్యవేక్షకురాలు అనిల్‌కుమారి బాలికలకు విద్య ఆవశ్యకతను వివరించారు. వారి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముస్తాబు చేసిన పలువురు చిన్నారులు వారి వేషధారణలతో ఆకట్టుకున్నారు.



బైపాస్ రోడ్డులో మోటార్ వర్కర్స్ ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న సభ్యులు

రతన్ టాటా మృతి.. పారిశ్రామిక రంగానికి లోటు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే : ఎందరో యువతకు ఉపాధి కల్పించిన పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటని మోటార్ వర్కర్స్ సభ్యులు నివాళులర్పించారు. గురువారం భీమవరం బైపాస్ రోడ్డులో టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రతన్ టాటా సంపదలో 65 శాతం సేవలకు కేటాయించారని, కరోనా సమయంలో కోట్ల రూపాయలు విరాళం అందించారన్నారు. మోటార్ వర్కర్స్, లారీ ఓనర్స్ సంఘ సభ్యులు నాగరాజు, రాము, సుబ్రహ్మణ్యంరాజు, గోవింద్, అల్లు శ్రీనివాస్, త్రినాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. నర్సయ్యఅగ్రహారం రోడ్డులో జనరేటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో రతన్‌టాటా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

భీమవరం పట్టణం, అర్బన్, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం, పద్మ విభూషణ్ రతన్‌టాటా మరణంతో భారత్ వెలకట్టలేని రత్నాన్ని కోల్పోయిందని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేయాలి

పాలకోడేరు, న్యూస్‌టుడే: గరగపర్రులో ఎస్సీ శ్మశాన వాటిక స్థలాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించి స్థలాన్ని అప్పగించాలని స్థానిక దళిత సంఘాల నాయకులు డొల్ల యెను, గొంది చిన్ని, ఏసోబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక చర్చిలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 2017 నుంచి స్థలాన్ని అప్పగించాలని పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానానికి దారి ఏర్పాటులో భాగంగా జేసీబీ తీసుకెళ్తే దాడి చేయడానికి వచ్చారని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. శ్మశాన స్థలాన్ని సైతం ఆక్రమించి షెడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే స్థలాన్ని సంఘానికి స్వాధీనం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.చిట్టిబాబు, ఎస్.జీవరత్నం, ఏసు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను గుర్తించి న్యాయం చేయాలి

పాలకోడేరు, న్యూస్‌టుడే: గరగపర్రులో స్థల వివాదంపై ముస్లిం మత పెద్ద, ఎంపీటీసీ సభ్యుడు షేక్ పాపా సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మసీదులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మసీదు సమీపంలోని స్థలంపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ముస్లిం మహిళలు ప్రార్థనలు చేసుకునే నిమిత్తం రహదారి పక్కన స్థలాన్ని కొనుగోలు చేశామని, అది ఎవరి సొంతం కాదని తెలిపారు. అటువంటి స్థలంలో ఉన్న షెడ్లను తొలగించడాన్ని అడ్డుకున్నామని తెలిపారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని షేక్ పాపా సాహెబ్ తెలిపారు. వాస్తవాలను పరిగణలోకి తీసుకుని అధికారులు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మతపెద్దలు షేక్ అబ్దుల్లా, షేక్ హుస్సేన్, షేక్ సిద్దాసాహెబ్, షేక్ మూలాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

సత్యా షోరూమ్ ప్రారంభం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని జువ్వలపాలెంరోడ్డులో సత్యా ఏజెన్సీస్ వారి 37వ షోరూమ్‌ను ప్రారంభించారు. భవన యజమాని అన్నపూర్ణ, వారి కుటుంబ సభ్యులు రిబ్బన్ కత్తిరించారు. ఎం.డి జాన్సన్, సత్య ఏజెన్సీస్ స్టేట్ హెడ్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన భీమవరంలో సత్యా షోరూమ్ ప్రారంభించడం ఆనందంగా ఉందని ఎండి జాన్సన్ అన్నారు.

రహదారి ప్రమాదంపై కేసు నమోదు

పాలకోడేరు, న్యూస్‌టుడే: శృంగవృక్షంలో ప్రధాన రహదారిపై నిర్లక్ష్యంగా లారీ పార్కు చేయడంతో బుధవారం జరిగిన కారు ప్రమాదంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు. పెదన మండలానికి చెందిన ఉపాధ్యాయులు కారులో భీమవరం వైపు వస్తుండగా శృంగవృక్షం వద్ద రహదారిపై అడ్డంగా పార్కుచేసిన లారీని వెనుకవైపు ఢీకొట్టారు. ఈ ఘటనలో పామర్తి లక్ష్మీబాయి, మరో నలుగురుకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇళ్ల బిల్లులకు మోక్షం

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు సొమ్ముల చెల్లింపు

వీరవాసరం, న్యూస్‌టుడే

గత తెదేపా హయాంలో నిర్మించిన పేదల ఇళ్ల బిల్లులను వైకాపా ప్రభుత్వం అక్కసుతో నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేయగా మరికొందరు మధ్యలో నిలిపివేశారు. వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఐదేళ్లు ముప్పుతిప్పలు పెట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో బడుగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఇలా..

మండలం	ఎన్టీఆర్ ఇళ్లు	బిల్లుల బకాయిలు (రూ. కోట్లలో)
భీమవరం	1387	3.82
వీరవాసరం	1233	2.62
ఉండి	1072	1.92
పాలకోడేరు	773	1.49
కాళ్ళ	1194	1.99
ఆకివీడు	880	1.40



వీరవాసరంలో నిలిచిపోయిన ఎన్టీఆర్ గృహాల నిర్మాణాలు

అప్పుల పాలై..

సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.2 లక్షల చొప్పున ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షల చొప్పున యూనిట్ విలువగా నిర్ణయించారు. నిర్మాణం పూర్తయిన వారికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లించారు. నిర్మాణం పూర్తి కావాల్సిన వారికి తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో వారంతా అప్పులపాలయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో మొత్తం 6,538 మంది లబ్ధిదారులు ఈ పథకం కింద ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు.

సర్వే ద్వారా గుర్తింపు

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా ఇంటి నిర్మాణాలు ప్రారంభించిన వారు వాటిని ఎంత వరకూ పూర్తి చేశారనే విషయంపై క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది సర్వే చేపట్టారు. అప్పట్లో భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని ఆరు గ్రామీణ మండలాల్లో మొత్తం 6,538 మంది ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అప్పటి వైకాపా ప్రభుత్వం కొందరికి బిల్లులు విడుదల చేసింది. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన సుమారు 2 వేలు పైచిలుకు లబ్ధిదారులకు ఇంకా రూ.13.14 కోట్లు బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. గృహ నిర్మాణ సంస్థ డీఈ శివరామరాజు మాట్లాడుతూ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఆయా ఇళ్లు ఏ దశలో ఉన్నాయో సర్వే యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలి: హర్షకుమార్

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ఎస్సీ క్రైస్తవులను ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దూషించి అవమానించారని ఆరోపిస్తూ...ఆయనను అరెస్టు చేయాలని మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి భీమవరం దళిత ఐకాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరుపాడు సంఘటన విషయంలో పోలీసులు ప్రభుత్వ ప్రేరణతో తమని చాలా ఇబ్బంది పెడుతున్నారన్నారు. సమావేశంలో దళిత ఐకాస నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

అధిక ధరలకు మద్యం విక్రయాలు

నరసాపురం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల్లో సిబ్బంది అధిక ధరలకు విక్రయాలు పాల్పడుతున్నారు. ఇప్పటికే తక్కువ ధరల మద్యం అందుబాటులో లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కష్టపడ్డ సొమ్ము మద్యానికే వినియోగిస్తున్నారు. దీనికి తోడు గురువారం ఒక్కొక్క మద్యం సీసా ధరకంటే రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. దీనిపై ఎక్సైజ్‌శాఖ సీఐ ఎస్.రాంబాబుకు పలువురు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఎస్సై ఆసిఫ్, సిబ్బంది దుకాణాలను పరిశీలించారు. అదనపు ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


వివరాలు తెలుసుకుంటున్న ఎక్సైజ్ ఎస్సై ఆసిఫ్ తదితరులు

విధులకు గైర్హాజరైతే చర్యలు


కాలువ పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం, న్యూస్‌టుడే: విధులకు గైర్హాజరయ్యే పారిశుద్ధ్య కార్మికులపై శాఖాపరమైన చర్యలు తప్పవని పురపాలక సంఘ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. ఆయన పట్టణంలో 14వ వార్డులో గురువారం పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. దోమల నిర్మూలనకు ఎం.ఎల్. ఆయిల్ చల్లాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిశోర్, కొప్పాడ కృష్ణవేణి తదితరులు ఉన్నారు.



కాలువ చెంత చెత్త... ప్రవాహం ఎట్టా..!

పెనుగొండ పరిసర ప్రాంతాల్లో సేకరించిన చెత్తను నక్కల కాలువ చెంత డంప్ చేస్తున్నారు. ఫలితంగా ఆ వైపు గట్టుతో పాటు కాలువ సైతం రోజురోజుకు చెత్తతో నిండిపోతోంది. ఫలితంగా నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. ఈ నక్కల కాలువ ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో ప్రవహిస్తోంది. కాలువ నిర్వహణ లేకపోవడం, ఎక్కడికక్కడే గ్రామాల్లో సేకరించిన చెత్త చెదారం వేస్తుండటంతో వర్షాలు కురిసిన సందర్భంలో ఈ పరీవాహక ప్రాంతాలన్నీ ముంపునకు గురికావడం సర్వసాధారణంగా మారింది. ప్రతి సీజన్‌లో వేలాది ఎకరాలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే

నడకకూ నరకమే!

ఈ దారులకు మోక్షమెన్నటికి?

పెనుగొండ, న్యూస్‌టుడే: కాకరపర్రు-నరసాపురం ప్రధాన కాలువకు కుడివైపు పెనుగొండ నుంచి మార్టేరు రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజలు చిరకాలంగా కోరుతున్నారు. ఈ మార్గంలో సత్యవరం, మార్టేరు, నెగ్గిపూడి, వనంపల్లి, వెలగలేరు పంచ గ్రామాలు, కాకిలేరు, కొయ్యేటిపాడు తదితర గ్రామాల ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి అధ్వానంగా మారింది. మొక్కలు పెరిగిపోయి రహదారిని ఆవరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుగొండలో ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కళాశాలలకు సైకిళ్లు ద్విచక్ర వాహనాలపై వెళ్లే విద్యార్థులంతా ఈ మార్గం వారికి కీలకంగా మారింది. పెనుగొండ-నరసాపురం ప్రధాన రహదారిపై ఏదైనా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైతే ఈ మార్గం ప్రత్యామ్నాయ దారిగా ఉపయోగపడుతోంది. పెనుగొండ వాసులు, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు చేర్చేందుకు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టలేదు. పంచాయతీరాజ్ డీఈ ఎన్.కృష్ణమూర్తిని వివరణ కోరగా ఈ రహదారి నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.


గోతులమయంగా పెనుగొండ- మార్టేరు రహదారి

● నరసాపురం కాలువ గట్టు పరిధిలోని పెనుగొండ వంతెన నుంచి బాపూజీపురం వరకు రోడ్డు రాళ్లు లేచి రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా ఉంది. పొలాలకు రాకపోకలు సాగించేందుకు, పంట ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు రైతులకు ఇదే ప్రధాన రహదారి. ఈ దారి పాడవటంతో తరచూ తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు, రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారి అభివృద్ధి పర్చాలని పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. పంచాయతీరాజ్ డీఈ ఎన్.కృష్ణమూర్తిని వివరణ కోరగా ఈ రహదారి నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.


ములపర్రు నుంచి చినమల్లం మార్గం దుస్థితి

వామ్మో అటు ప్రయాణమా...!

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పలు మార్గాలు గోతులతో అధ్వానంగా మారాయి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ములపర్రు నుంచి చినమల్లం రహదారి నిర్వహణ లేక పాడైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే స్థానికులు భయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం కురిసినా, రాత్రి సమయంలో ఇటువైపు ప్రయాణించడానికి అవకాశం లేదు. ఈ రెండు గ్రామాల రైతులకు ఈ మార్గంలో రాకపోకలు చేయడం తప్పనిసరి కావడంతో పడుతూ లేస్తూ ముందుకు సాగుతున్నారు. పంచాయతీరాజ్ ఏఈ ఏడుకొండలు మాట్లాడుతూ రహదారి అభివృద్ధికి ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెప్పారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి


కార్యక్రమంలో సీడీపీవో కృష్ణకుమారి, ఇతర సిబ్బంది

పెనుమంట్ర, న్యూస్‌టుడే: బాలికలు తమకున్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.కృష్ణకుమారి సూచించారు. మండలంలోని నెగ్గిపూడి, మార్టేరు, సత్తారామేశ్వరం, పెనుమంట్ర, పొలమూరు గ్రామాల్లో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, చట్ట పరమైన హక్కులు, వైద్య సంరక్షణ, గౌరవం వంటి విషయాలు గురించి బాలికలు తెలుసుకోవాలని కోరారు.

తల్లిదండ్రుల అప్రమత్తత అవసరం.. పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: బాలికల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.ఎం.ఎం.రూత్‌కుమారి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సిద్ధాంతం సెక్టార్‌లో గురువారం జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానత్వం, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, బాల్య వివాహాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.

కిశోర బాలికలకు అవగాహన.. యలమంచిలి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చేసుకోవడం నేరమని పాలకొల్లు ఐసీడీఎస్ ఏసీడీపీవో నాగరత్నం అన్నారు. మండలంలోని చింతదిబ్బ పరిధిలోని సీతమ్మ చెరువు అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోర బాలికలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యుక్త వయసు నుంచి వ్యక్తిగత పరిశుభ్రత అలవరుచుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు.

ములపర్రులో పెరుగుతున్న జ్వరాలు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ములపర్రు శివారు పెదగర్వులో రెండు రోజులుగా సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 20 మంది వరకు అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి జ్వరాలతో ఉన్న వారిని గుర్తించే పనిలో పడ్డారు. సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంపీహెచ్‌ఈవో బృందేశ్వరరావు జ్వరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

మార్టేరు, న్యూస్‌టుడే: పెనుమంట్ర మండలం నుంచి మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు అందాయి. ఆరు దుకాణాలకు గురువారం రాత్రికి 80 దరఖాస్తులు అందినట్లు తణుకు ఎక్సైజ్ సీఐ మణికంఠ రెడ్డి తెలిపారు. మరో రోజు గడువు ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బృందాలుగా ఏర్పడి దరఖాస్తు చేసిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. కొన్ని దుకాణాలకు సామాజిక వర్గాల వారీగా దరఖాస్తు చేసి ఆ దిశగా వాటిని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ప్రజల అవసరాలు తీర్చాలి

పెనుగొండ, న్యూస్‌టుడే: సోమరాజు చెరువు పంచాయతీ ప్రజల అవసరాలను తీర్చాలని సీపీఎం జిల్లా నాయకుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం సోమరాజుచెరువులో నిర్వహించిన సీపీఎం గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. సోమరాజు చెరువు సీపీఎం శాఖ కార్యదర్శిగా కౌరు జగన్నాథంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అగ్నిప్రమాద బాధితులకు సాయం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలంలోని పెద్దమామిడిపల్లి, కాపవరం గ్రామాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం అందించారు. నిత్యావసర సరకులను, వంట సామగ్రి, దుస్తులను గురువారం అందించారు. బాధిత కుటుంబాలకు ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్, మంత్రి నిమ్మల రామానాయుడు సాయం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కోడి విజయభాస్కర్, పాముల రజిని కుమార్, కౌరు మురళి, గుబ్బల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: వసుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం కాళీపట్నానికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు ఆర్.విజయభాస్కర్‌కు రూ.10వేలను ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయరాజు, వెంకట్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రక్షాళనకు చర్యలు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: యర్రంశెట్టిపాలెం గ్రామం మూడు ఎకరాల విస్తీర్ణంలోని శ్మశానవాటిక అంతా డొంకలు, తుప్పలు పెరిగిపోయి ఆక్రమణలకు గురైంది. దీంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం శ్మశాన వాటికలో నిలబడేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగ ముత్యమాంబ ఆధ్వర్యంలో శ్మశానవాటికలో ఆక్రమణలు. డొంకలు, తుప్పలను పొక్లెయిన్‌తో తొలగించే పనులను గురువారం నుంచి చేపట్టారు. అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల అభివృద్ధికి ఏమాత్రం ప్రాధాన్యమివ్వలేదని, చిన్న పని చేసేందుకు కూడా సర్పంచులకు అవకాశం లేకుండా చేశారని సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రామాల్లో పల్లె పండగ పేరుతో చేపట్టనున్న అభివృద్ధి పనులతో గ్రామాల రూపు రేఖలు మారనున్నాయని ఆమె పేర్కొన్నారు. శ్మశాన వాటిక ప్రక్షాళన పనులను ఉప సర్పంచి తెలంగశెట్టి శ్రీదేవి తదితరులు పర్యవేక్షించారు.


శ్మశాన వాటికను పొక్లెయిన్‌తో చదును చేయిస్తూ..

రహదారిపై కూలిన కొబ్బరి చెట్టు



పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగ-సోమరాజు ఇల్లింద్రపర్రు మార్గంలో గురువారం సాయంత్రం మల్లిపూడి డిజిటల్ గ్రంథాలయ భవనానికి సమీపంలో ప్రధాన రహదారిపై కొబ్బరి చెట్టు కూలింది. ఈ సమయంలో వర్షం పడుతుండటంతో అటుగా ఎవరూ రాక ప్రమాదం తప్పింది. కేవలం పది నిముషాల పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో పంట కాలువకు చేర్చి ఉన్న పొడవైన చెట్టు ఒక్కసారిగా రహదారికి అడ్డంగా పడింది. దీంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. స్థానికులు స్పందించి చెట్టును పక్కకు నెట్టడంతో వాహనాలు యథాతథంగా ముందుకు సాగాయి.

పేదలకు అండగా రాయితీపై నిత్యావసర సరకులు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదలకు అండగా రాయితీపై నిత్యావసర సరకులు అందజేస్తోందని ఆర్డీవో దాసి రాజు అన్నారు. పట్టణంలో రాయితీపై అందజేస్తున్న ఉల్లిపాయలు, టమోటా, వంట నూనెల విక్రయ కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాజరాజేశ్వరి, పురపాలక సంఘ కమిషనర్ ఎం.అంజయ్య, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, వార్డు కౌన్సిలర్ కోటిపల్లి సురేశ్, తోట అరుణ, కోటపల్లి వెంకటేశ్వరరావు, వలవల నానీ తదితరులు పాల్గొన్నారు.


సరకులు అందజేస్తున్న ఆర్డీవో రాజు తదితరులు

లోక జననీ పాహిమాం

నరసాపురం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు 8వ రోజు సందర్భంగా గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవిని దుర్గాదేవిగా అలంకరించారు. ● వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారు నవ దుర్గా దేవిగా దర్శనమిచ్చారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: నగరేశ్వర, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 102 మంది కన్యల పూజ వేడుకగా జరిగింది.

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండల కేంద్రంలోని ప్రధాన కూడలితో పాటు పుంతలో ముసలమ్మ ఆలయ ప్రాంగణం, ప్రేమనగర్ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మేడపాడులో కమిటీ కుర్రోళ్లు ఏర్పాటు చేసిన వేదికపై పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.


వాసవీ ఆలయంలో పూజలు

అర్ధనారీశ్వర అలంకరణలో అమ్మవారు


నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: శేరేపాలెంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి గురువారం అర్ధ నారీశ్వర అలంకరణ చేశారు. ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మవారికి, పేరుపాలెం నార్తు దిండ్లలో కనకదుర్గమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: ఆచంట సీహెచ్‌సీలో దుర్గామాతకు సూపరింటెండెంట్ శివరంజని ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.


క్షీరారామంలో దుర్గాదేవిగా..


పెనుగొండ: మహిషాసుర మర్దని


యలమంచిలి సెంటర్‌లో..


శేరేపాలెం: అర్ధనారీశ్వర అలంకరణలో..

అవి ఇవి అన్నీ

డీఈఈ బాధ్యతల స్వీకరణ.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు పాలకొల్లు పట్టణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సీహెచ్ రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు తణుకులో పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన వెంకట్రావును గ్రామీణ శాఖకు బదిలీ చేశారు. గ్రామీణ శాఖలో పనిచేసిన ఆర్.నాగేశ్వరరావు ఏలూరు బదిలీపై వెళ్లారు. నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని రామకృష్ణ తెలిపారు. పట్టణ ఇన్‌ఛార్జి ఏఈ షేక్ బాబ్జీ, గ్రామీణ ఏఈ శ్రీనివాసరావు, వీరవాసరం ఏఈ ఆర్వీ అప్పారావు శుభాకాంక్షలు తెలిపారు.

సేవ చేయడంలోనే నిజమైన ఆనందం.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: సాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గుండె, మెదడు సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పట్టణానికి చెందిన కె.శ్రీనివాస్, వై.అరుణలకు రూ.12 వేల మందులను స్థానిక ప్రియాంక టవర్స్ వద్ద అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీరు సాహెబ్, కోశాధికారి పి.ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు ఎం.బసవరాజు, కల్యాణ్, ఆనంద కృష్ణ పాల్గొన్నారు.

మానవతావాది రతన్ టాటాకు నివాళి.. మొగల్తూరు, న్యూస్‌టుడే: మానవతావాది రతన్ టాటాకు ఆర్యవైశ్య సంఘీయులు ఘన నివాళి అర్పించారు. ఆయన మృతి చెందిన సందర్భంగా రతన్‌టాటా చిత్ర పటం ఏర్పాటు చేసి పూలమాల అలంకరించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కారుమూరి దత్తుడు, రవి, బాలాజి, మానేపల్లి రంగ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠానికి కృషి చేయాలి.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: కార్యకర్తలంతా పార్టీ పటిష్ఠానికి కృషి చేయాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరి కుమార్‌రాజు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. చిత్తశుద్ధితో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలుకులూరి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి.. మొగల్తూరు, న్యూస్‌టుడే: విషపు గుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేసిన బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దీనికి సంబంధించి ఆ బాలిక బంధువులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 5న అదృశ్యమైంది. బాలిక, ఆ బాలికను అపహరించిన యువకుడు రెండ్రోజుల కిందట హైదరాబాదులో విషపు గుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో ఆ ప్రాంతవాసులు వారిరువురినీ ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. బాలిక అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్సై జి.వాసు హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. శవ పంచనామా అనంతరం బాలిక మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువస్తామని ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తాడేపల్లిగూడెం

● తాడేపల్లిగూడెం ● తణుకు

16 నుంచి ధాన్యం కొనుగోళ్లు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టు: ఈ నెల 16 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్‌ఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. దళారులు, మధ్యవర్తులకు విక్రయించి నష్టపోవద్దని తెలిపారు. మండలంలో పీఆర్126 రకం సుమారు ఆరు వేల ఎకరాల్లో సాగు అవుతోందని తెలిపారు. ప్రస్తుతం ఈ రకం పంట కోతలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ రకం ధాన్యంలో 17 శాతం తేమ ఉంటే రైతుకు క్వింటాకు రూ.2,320 వస్తుందని వెల్లడించారు. మండలంలో 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపిక

తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ జట్టుకు జిల్లా క్రీడాకారులు ముప్పిడి కిషోర్ బాబు, ఎండీ కాలిష్ ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి దాసం వెంకట దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

రతన్ టాటాకు రాధాకృష్ణ సంతాపం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రతన్ టాటా మరణం మానవాళికి తీరని లోటని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతికి గురువారం ఆయన ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌ను ఆయన అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా చేశారని కొనియాడారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసి ఎందరి జీవితాల్లో ఆయన చిరస్థాయిగా నిలిపోయారని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత

గణపవరం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మలేరియా ఉప అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. కేశవరంలో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యాన గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి శ్రీదేవి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు బస్టాండులో ఒకరి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు బస్టాండులోని 15వ ప్లాట్‌ఫాం వద్ద గురువారం ఉదయం ఓ వ్యక్తి మృతి చెందాడు. బల్లపై కూర్చొని అచేతనంగా ఉన్న అతన్ని సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడ్ని తాడేపల్లిగూడెం మండలం పాతూరుకు చెందిన రెంకిరెడ్డి శ్రీనివాస చక్రవర్తి అలియాస్ చిన్నా(45)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'పల్లె పండగ' విజయవంతానికి పిలుపు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండగ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం, న్యూస్‌టుడే: గర్భిణులు రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా 76 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ... ప్రతి గర్భిణి విధిగా ఆరోగ్య కేంద్రానికొచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



అత్తిలి మండలం కంచుమర్రులోని పశువైద్యశాలను సుమారు ముప్పైఏళ్ల కిందట నిర్మించారు. చుట్టూ నాలుగు గ్రామాల నుంచి పాడిరైతులు ఇక్కడికి వచ్చేవారు. ఈ వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. కొద్ది నెలలుగా ఇక్కడ వైద్య సేవలు కూడా నిలిపివేశారు. రైతులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించడంతో వారిపై ఆర్థికంగా భారం పడుతోంది.



ఇరగవరం మండలం కొత్తపాడు పశువైద్యశాలను 1984లో నిర్మించారు. కంతేరు, అయినపర్రు, కొత్తపాడు, ఓగిడి తదితర గ్రామాల రైతులు వినియోగించుకుంటారు. భవన గోడలు బీటలువారి చెమ్మగిల్లుతున్నాయి. శ్లాబ్ నుంచి వర్షపు నీరు లోపలికి వస్తోంది. సిబ్బంది అవస్థలు పడుతూ వైద్యం అందించాల్సిన పరిస్థితి.

శిథిల నీడలో పశు వైద్యశాలలు

పాడి రైతులకు తప్పని కష్టాలు

మండపాక, తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో పాడిపశువులకు వైద్య సేవలందించేందుకు గతంలో నిర్మించిన వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. గోడలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టు ఉన్నాయి. సిబ్బంది బిక్కు బిక్కు మంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ పశువైద్యశాలల్లో ప్రయోగశాలలు లేకపోవడంతో పాడి రైతులు ప్రతి పరీక్షకు తణుకు పాలిక్లినిక్‌కు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. పశు వ్యాధులకు అవసరమైన మందులు సైతం పూర్తి స్థాయిలో లేక బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

మండలం	ఆవులు	గేదెలు	మేకలు/గొర్రెలు	పందులు	కుక్కలు
తణుకు పట్టణం	344	855	354	20	666
తణుకు మండలం	683	5094	401	0	599
ఇరగవరం	1863	7671	1210	78	591
అత్తిలి	965	6080	579	114	443

ఇదీ పరిస్థితి

తణుకు మండలంలో 4, ఇరగవరంలో 4, అత్తిలిలో 5 పశువైద్యశాలలు ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఆవులు 3,855, గేదెలు, 19,700, మేకలు/గొర్రెలు 2,544, పందులు 112, కుక్కలు 2,299 ఉన్నాయి. మొత్తం 13 భవనాల్లో సగానికిపైగా శిథిలావస్థలో ఉన్నాయి. వేల్పూరు, మండపాక, దువ్వ, ముద్దాపురం, కొత్తపాడు, రేలంగి, కొమ్మర, కంచుమర్రులలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిలో పలు చోట్ల గోడలు కూలిపోయి, మరికొన్నిచోట్ల మరుగుదొడ్లు లేక, బోన్లు తుప్పుపట్టి విరిగిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో విధులు నిర్వహించే సిబ్బంది, రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలలు గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించామని పశువైద్యశాఖ ఏడీ నరసింహారావు తెలిపారు.



తణుకు మండలం దువ్వలో పశువైద్య కేంద్రం నిర్మించి సుమారు 38 ఏళ్లు అయ్యింది. భవనం గోడలు పగుళ్లు తీశాయి. బోను తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉంది. భవనం శిథిలావస్థకు చేరడంతో రైతులు సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ధరల నియంత్రణకు కృషి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువుల రాయితీ కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లిపాయలు, టమాటాలతో పాటు నూనెలను తక్కువ ధరకు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 10 రైతుబజారుల్లో ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మినపప్పు, శనగపప్పు తదితర నిత్యావసరాలను కూడా రాయితీ ధరలపై ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భవాని శంకరి, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ, భాజపా నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ బాధ్యతల స్వీకరణ

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు పాలకొల్లు పట్టణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సీహెచ్ రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు తణుకులో పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన వెంకట్రావును గ్రామీణ శాఖకు బదిలీ చేశారు. గ్రామీణ శాఖలో పనిచేసిన ఆర్. నాగేశ్వరరావు ఏలూరు బదిలీపై వెళ్లారు. నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని రామకృష్ణ తెలిపారు.

మానసిక వికలాంగులను చులకనగా చూడకూడదు



మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్వర్లు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు ప్యానల్ న్యాయవాదులు గురువారం పాలంగిలో మానసిక వికలాంగుల గృహం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాది కౌరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అర్హత ఉండి పింఛను రాకపోయినా మండల న్యాయ సేవా కమిటీని సంప్రదించాలని తెలిపారు. మానసిక దివ్యాంగుల పిల్లలను చులకనగా చూడకూడదన్నారు.

వెల్లమిల్లి వాసికి 'రైతు నేస్తం' పురస్కారం

వెల్లమిల్లి(ఉంగుటూరు), న్యూస్‌టుడే: వెల్లమిల్లికి చెందిన పరిమి సత్యనారాయణ రైతు నేస్తం పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రతిభ చూసిన శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ విభాగాల్లో ముప్పవరపు ఫౌండేషన్‌తో కలిసి ఏటా 'రైతు నేస్తం' పురస్కారాలు అందిస్తున్నారు. కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఈ నెల 20న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా సత్యనారాయణ పురస్కారం అందుకోనున్నారు.

బాలికలను సంరక్షించాలి



పైడిపర్రు : ప్రదర్శనలో అంగన్‌వాడీ ఏసీడీపీవో, సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలే బంగారమని, వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ సుజాత రాణి పేర్కొన్నారు. పట్టణంలోని మూడో వార్డులో గురువారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలపై దాడులు జరుగుతున్నాయన్నారు. స్త్రీని శక్తిగా పూజించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

★ తణుకులో ఇరగవరం కాలనీ, సజ్జాపురం, పైడిపర్రు, కోమ్మాయిచెరువు గట్టు తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, లింగ అసమానత, విద్య పరిమితులు, హింస, బలవంతపు బాల్య వివాహాలు తదితర అంశాలపై ఐసీడీఎస్ ఏసీడీపీవో ఆశారోహిణి, పర్యవేక్షకురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ప్రదర్శన నిర్వహించారు.

★ ఇరగవరం మండల రేలంగిలో పర్యవేక్షకురాలు మాణిక్యాంబ ఆధ్వర్యంలో బాలికల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

★ తణుకు మండలంలోని దువ్వ, ముద్దాపురం, తేతలి, కోనాల గ్రామాల్లో పర్యవేక్షకురాలు సీహెచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ★ తణుకు పట్టణంలోని పదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పర్యవేక్షకురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరిత, త్రివేణి, పరమేశ్వరి లలిత, కృష్ణవేణి, ఎం జ్యోతి, నాగవల్లి పాల్గొన్నారు.

36 దుకాణాలు.. 767 దరఖాస్తులు

గడువు పెంపుతో మరిన్ని పెరిగే అవకాశం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ మద్యం పాలసీలకు స్వస్తి పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం నూతన మద్యం విధానాలను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటుకు సంబంధించి సర్కారు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు గడువును సైతం ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పొడిగించింది. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలకు 36 మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ ప్రక్రియ అనంతరం భీమవరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్లో ఈ నెల 14న దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీలు తీయనున్నారు. లైసెన్సు పొందినవారు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సీఐ వి.కల్యాణ్ చక్రవర్తి

ఎక్కడెక్కడ ఎన్ని?

తాడేపల్లిగూడెం సర్కిల్ పరిధిలో నాలుగు మండలాలకు 36 మద్యం దుకాణాలను జనాభా ప్రాతిపదికన కేటాయించారు. తాడేపల్లిగూడెం పట్టణం-11, తాడేపల్లిగూడెం మండలం-6, గణపవరం-4, పెంటపాడు-8, అత్తిలి-7 మద్యం దుకాణాలు రానున్నాయి. ఇప్పటి వరకు 767 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ.15.34 కోట్ల ఆదాయం రావడం విశేషం.

వార్షిక ఫీజు రూ.65 లక్షలు

సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 50 వేలకు పైగా జనాభా ఉండటంతో లైసెన్సు పొందినవారు ఒక్కో షాపునకు వార్షిక ఫీజు రూ.65 లక్షలు చెల్లించాలి. ఈ మొత్తాన్ని నాలుగు వాయిదాల్లో చెల్లించే వెసులుబాటును కల్పించారు. రెండేళ్ల కాలపరిమితిలో మొదటి ఏడాది రూ.65 లక్షలు చెల్లిస్తే రెండో ఏడాది 10 శాతం అదనంగా కలిపి రూ.71.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీలు

దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తాం. ఇది పూర్తిగా పారదర్శకం. ఈ విషయంలో వస్తున్న వదంతులను ఎవ్వరూ నమ్మవద్దు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం గడువును పెంచింది.

-కేఎస్‌వీ కల్యాణ్ చక్రవర్తి, ఎక్సైజ్ సీఐ



దువ్వలో రూ.70లక్షలతో అలంకరించిన కనకదుర్గ అమ్మవారు


త్రినయని.. త్రిశూలధారిణి!



ముత్యాలంబపురం: ముత్యాలమ్మ



ప్రత్తిపాడులో..



భాగ్యలక్ష్మి పేటలో



బలుసులమ్మ

తాడేపల్లిగూడెం టూటౌన్, పెంటపాడు, న్యూస్‌టుడే : తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబపురంలో కొలువైన శ్రీముత్యాలమ్మతల్లి దేవస్థానంలో గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు చేశారు. ఈవో హరేరామప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ★ పెంటపాడు మండలం ప్రత్తిపాడు వైకూడలిలో కనకదుర్గమ్మ, కాగులంపాడులో స్వయంభూ కనకదుర్గమ్మ, కస్పాపెంటపాడు బైరాగిమఠం, మీనవల్లూరు కనకదుర్గమ్మ, అలంపురం, ముదునూరు రాజరాజేశ్వరి, బోడపాడు దుర్గాదేవి ఆలయాల్లో కొలువైన అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లోని అమ్మవార్లను కనకదుర్గాదేవిగా, సంతాన లక్ష్మిగా, మహా గౌరిగా విశేషంగా అలంకరించారు.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తణుకు నియోజకవర్గంలోని పట్టణ, గ్రామాల్లో అమ్మవారు విశేష పూజలు అందుకుంటున్నారు. గురువారం స్థానిక బొమ్మల వీధిలోని భవాని పీఠం వద్ద తెదేపా రాష్ట్ర నాయకులు వావిలాల సరళాదేవి, వెంకటరమేశ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, భవానీలు, భక్తి శ్రద్ధలతో అమ్మవారికి లలితా పారాయణం, భక్తి పాటలు ఆలపించారు. ఈ సందర్భంగా పీఠం వద్ద 3000 మందికి భవానీలు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

★ దువ్వ కొత్త బస్టాండ్ వద్ద కనకదుర్గమ్మను రూ.70లక్షలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ★ మండపాక యల్లారమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. ★ వాసవీ ప్రార్థన మందిరంలో వాసవీమాతను శ్రీ గాయత్రీ దేవిగా అలంకరించారు.

అయ్యప్ప స్వామి పడి పూజ.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జాతీయ రహదారి ఆనుకుని ఉన్న శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయప్ప స్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం పడి పూజ కార్యక్రమాన్ని స్వాములు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి చలపతి ఆధ్వర్యంలో పూజారి సత్యనారాయణ సమక్షంలో అయ్యప్పస్వామికి విశేష అలంకరణలు, అభిషేకాలు చేశారు.



తాడేపల్లిగూడెం: కలశాలతో ప్రదర్శన

ట్రస్ట్ సేవలు అభినందనీయం

పెంటపాడు, న్యూస్‌టుడే: పెంటపాడు మండలం అలంపురంలోని శ్రీవెంకటరమణ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఉచిత ఆసుపత్రి సేవలు అభినందనీయమని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఉచిత ఆసుపత్రిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. అక్కడ ఉచితంగా అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ప్రత్తిపాడు పంచాయతీకి సమకూర్చిన వాటర్‌ట్యాంక్‌ను వారు ప్రారంభించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడంలో స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు చెరుకూరి జగత్ సోమశేఖర్, పాలూరి వెంకటేశ్వరరావు, మజ్జి అప్పారావు, వీర్ల గోవిందరాజు, గిద్దా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.